# కర్నూలు | నంద్యాల వార్త

16 అక్టోబర్ 2025 గురువారం పేజీలు 4


## ప్రధాని పర్యటన.. ఏర్పాట్లు పూర్తి

: సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్

: పర్యటన విజయవంతానికి అన్ని చర్యలు : వీరపాండియన్



**కర్నూలు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టామని ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ముఖ్యమంత్రికి ఏర్పాట్లపై వివరాలు సమర్పించారు. వీరపాండియన్ మాట్లాడుతూ, వేదిక ఏర్పాటు, ప్రధానమంత్రి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి హెలిప్యాడ్‌ల నిర్మాణం, బ్యాక్‌డ్రాప్ డిజైన్, భోజన సదుపాయాలు, త్రాగునీటి సరఫరా వంటి అంశాలను సమీక్షించామన్నారు. రిహార్సల్ కార్యక్రమం కూడా విజయవంతంగా నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి మాట్లాడుతూ, ప్రధానమంత్రి గారికి మూడు హెలిప్యాడ్‌లు, రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి రెండు హెలిప్యాడ్‌లు నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. బ్యారికేడింగ్ పనులు, పార్కింగ్ ప్రాంతంలో టాయిలెట్లు, విద్యుత్ సరఫరా, హెల్ప్‌డెస్క్‌లు, సౌండ్ సిస్టమ్, త్రాగు నీరు, వైద్య సదుపాయాల ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. అలాగే 20 బెడ్ల ఆసుపత్రి, 10 బెడ్ల తాత్కాలిక ఆసుపత్రి, నిపుణుల వైద్య బృందాలను సిద్ధం చేశామని వివరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా చర్యలను ముఖ్యమంత్రి గారికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐఏఎస్ అధికారులు దినేష్, విజయ సునీత, డిల్లీ రావు, శౌర్యమాన్ పటేల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, సచిన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ.. కర్నూలు జిల్లా పర్యటన

: అధికారిక షెడ్యూల్

**కర్నూలు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పర్యటనకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన కర్నూలు జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ప్రధానమంత్రి షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 7.50 గంటలకు ఢిల్లీ విమానాశ్రయం నుంచి ఐఏఎఫ్ ఎంబ్రాయర్ విమానంలో బయలుదేరి, ఉదయం 10.20 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఎంఐ-17 హెలికాప్టర్ ద్వారా ఉదయం 11.05 గంటలకు సుందిపెంట హెలిప్యాడ్‌కి చేరుకుంటారు. అక్కడి నుండి రహదారిమార్గం ద్వారా భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కు వెళతారు. ఉదయం 11.45 నుండి మధ్యాహ్నం 12.35 గంటల వరకు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో దర్శనం మరియు పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.20 గంటలకు కర్నూలు హెలిప్యాడ్‌కి తిరిగి చేరుకుని, అక్కడి నుండి రహదారిమార్గం ద్వారా నన్నూరు గ్రామ సమీపంలోని రాగా మయూరి గ్రీన్ హిల్స్ వద్ద బహిరంగ సభా ప్రాంగణానికి బయలుదేరుతారు. మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 4.05 గంటల వరకు కర్నూలులో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పునాది రాళ్లు వేయడం, ప్రారంభోత్సవాలు మరియు దేశానికి అంకితం చేసే కార్యక్రమంలో పాల్గొంటారు. తదుపరి సాయంత్రం 4.10 గంటలకు హెలిప్యాడ్‌కి తిరిగి చేరుకుని, 4.20 గంటలకు ఎంఐ-17 హెలికాప్టర్‌లో కర్నూలు విమానాశ్రయానికి చేరుకుంటారు. సాయంత్రం 4.45 గంటలకు కర్నూలు నుండి ఢిల్లీకి ఐఏఎఫ్ ఎంబ్రాయర్ విమానంలో బయలుదేరి, రాత్రి 7.10 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు. ఈ పర్యటనకు సంబంధించి అన్ని విభాగాలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాయని కేంద్ర అధికారిక వర్గాలు తెలిపాయి.

# ప్రధాని ప్రారంభించనున్న.. అభివృద్ధి పనులు..!



- పలు ప్రాజెక్టుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రూ.13,430 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో నేడు ప్రధాని పర్యటన

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పలు అభివృద్ధి కానుకలు అందించనున్నారు. రాయలసీమ సహా రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక, రహదారి, రైల్వే రంగాల అభివృద్ధికి ఊతమిచ్చే పలు కీలక ప్రాజెక్టులకు ప్రధానమంత్రి గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ మేరకు ప్రధానమంత్రి పర్యటన వివరాలను ప్రధాని కార్యాలయం అధికారికంగా వెల్లడించింది. మొత్తం రూ.13,430 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.**







**కర్నూలు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధికి కొత్త దశను తెరతీయనున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కర్నూలు-3 పూలింగ్ స్టేషన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ రూ.2,880 కోట్ల వ్యయంతో కర్నూలు-3 పూలింగ్ స్టేషన్ అనుసంధాన ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ నిర్మాణానికి ప్రధానమంత్రి మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో విద్యుత్ సరఫరా సామర్థ్యం గణనీయంగా పెరుగనుంది.


• వివరాలు 2లో




## వెల్దుర్తిలో ప్రబలుతున్న.. డెంగీ జ్వరాలు..!

– మరో 3 డెంగీ కేసులు నమోదు..



**వెల్దుర్తి, అక్టోబర్15, ప్రభాతవార్త** మండల కేంద్రమైన వెల్దుర్తి మేజర్‌గ్రామ పంచాయతీ పరిధిలోని 2,15వ వార్డులకు చెందిన నవీన్‌దుర్గ, హోంగార్డు షాకీర్‌లకు డెంగీ జ్వరం వచ్చినట్లు తెలిసింది. వీరు వెల్దుర్తి సిహెచ్‌సిలో ప్రస్తుతం వైద్యసేవలు పొందుతున్నారు. గత నవీన్‌దుర్గ సోమవారం రాత్రి అడ్మిట్ కాగా మరుసటి రోజు వైద్యపరీక్షలు చేసి వైద్యులు ధృవీకరించారు. ఇక 15వ వార్డులో ఉంటున్న హోంగార్డు షాకీర్‌బాష కుమారుడికి ముందుగా డెంగీ జ్వరం వచ్చింది. బుధవారం హోంగార్డుకు డెంగీ జ్వరం రావడంతో తండ్రి, కొడుకు ఇదే వైద్యశాలలో వైద్యచికిత్సలు పొందుతున్నారు. ఏది ఏమైనా డెంగీ జ్వరాలు నెమ్మదిగా రోజు రోజుకు పెరుగుతుండడంతో ప్రజలు భయాందోళనలకు గురి అవుతున్నారు. ఈ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండకపోతే ఇబ్బందులు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు. అదేవిధంగా ఎస్సీ కాలనీకి చెందిన చిన్నారికి సైతం వైరల్ జ్వరం రావడంతో ఆ చిన్నారికి వైద్యసేవలు అందిస్తున్నారు. పలువురు దగ్గు, జలుబు, జ్వరం, గొంతునొప్పి కారణాలతో వైద్యశాలలో వైద్యసేవలు పొందుతున్నారు. దోమలు ప్రబలకుండా సంబంధిత అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



## భద్రత పట్ల.. అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రధాని మోడీ పర్యటనపై ఏర్పాట్లు పరిశీలన





**కర్నూలు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** కర్నూలులో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సూచించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో అదనపు డీజీపీ ఎన్. మధుసూదన్ రెడ్డి, ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, గోపినాథ్ జెట్టి, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, ఫక్కీరప్ప కాగినెల్లి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రధాని పర్యటన మినిట్‌టుమినిట్ ప్రోగ్రామ్, రూట్ మ్యాప్, రాగమయూరి బహిరంగ సభ స్థల వివరాలు, గూగుల్ జియో మ్యాప్ పై వివరణ ఇచ్చారు. డీజీపీ గారు పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, పర్యటన సాఫీగా, ప్రశాంతంగా జరగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ సభకు వచ్చే బస్సులు, రాకపోకలపై పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. రోడ్ షో ప్రాంతాల్లో బ్యారికేడ్లు, రోప్ పార్టీలు సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే వాలంటీర్ల సహకారం తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలు సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రింది స్థాయి సిబ్బందిని సమర్థంగా మానిటర్ చేస్తూ, కేటాయించిన విధులలో అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అదనపు డీజీపీ ఎన్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, నన్నూరు టోల్ గేట్ వద్ద అవసరమైతే పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, రోడ్ షో ప్రాంతాల్లో ప్రజలు గుమిగూడకుండా నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ సభ వద్ద మఫ్టీ పోలీసులను నియమించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఐజీలు, ఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.













## ప్రధాని పర్యటనతో.. కట్టుదిట్టమైన భద్రత

- పోలీసుల వలయంలో శ్రీశైలం.
- శ్రీశైలం మల్లన్న దర్శించుకోనున్న ప్రధాని
- కొత్త హంగులతో అతిథి గృహం సిద్ధం.
- కాషాయ మయమైన పురవీధులు .
- నల్లమల్ల జల్లెడ పట్టిన ప్రత్యేక బలగాలు.





**శ్రీశైలం బుధవారం 15 ప్రభాతవార్త :** భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ గురువారం నాడు శ్రీశైలం మల్లన్న ను దర్శించుకునేందుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో గత పది రోజుల నుండి ఏర్పాట్ల పైన మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఆయా శాఖల అధికారులు పెద్ద ఎత్తున ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎక్కడ కూడా లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించారు. మంగళవారం నాడు ఆర్మీ హెలికాప్టర్లు సున్నిపెంట చేరుకొని ఇప్పటికే ట్రైలర్ నిర్వహించారు. సుండి పెంట హెలిప్యాడ్ వద్ద అతిధులకు ఫ్యాబ్రికేటెడ్ వసతులను ఏర్పాటు చేశారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలలో ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా స్వయానా అధికారులతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఉదయం 11 గంటలకు సుండుపెంట హెలిప్యాడ్ కు చేరుకోనున్నట్లు తెలుస్తుంది. హెలిప్యాడ్ వద్ద ప్రధానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఘన స్వాగతం పలుకనున్నారు. అక్కడనుండి రోడ్డు మార్గమున కాన్వాయ్ లో బయలుదేరి శ్రీశైలం లో గల భ్రమరాంబ అతిథిగృహానికి ప్రధాని చేరుకోనున్నారు. ప్రధానికి ఏర్పాటుచేసిన అతిథిగృహం క్రొత్త హంగులతో కలకలలాడుతుంది. ఖరీదైన ఫర్నిచర్ ను అధికారులు సిద్ధం చేసి ఉంచారు. తదుపరి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు.


• వివరాలు 2లో


















## పెద్దపులికి పోంచి ఉన్న ప్రమాదం..!?

: శ్రీశైలం పాతాళగంగలో మృతి చెందిన చిరుతపులి

: అభయారణ్యంలో వన్యప్రానుల సంరక్షణ భద్రమేనా..?


2లో




# భారత ప్రధాని నరేంద్రమోడి సభను విజయవంతం చేయండి

**– మాజీ ఎంపిపి యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్**



**వెల్దుర్తి, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** భారతదేశ ప్రధాని నరేంద్రమోడి సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపిపి, తెదేపా సీనియర్ నాయకులు యల్.ఇ.జ్ఞానేశ్వర్‌గౌడ్ తెదేపా, బిజెపి, జనసేన(కూటమి) నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని తన స్వగృహాంలో బుధవారం ఆయన తెదేపా నాయకులతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. ఈనెల16న సూపర్ జీఎస్టీ, సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి, ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు, బిజెపి పెద్దలు వస్తున్నారని ఈ పర్యటనతో చాలా పరిశ్రమలు మనకు వస్తున్నాయని ఫలితంగా చాలా మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తున్నాయన్నారు. వెల్దుర్తి మండలం నుంచి 101 బస్సులు ప్రధాని సభకు అందరు(కూటమి నాయకుల)తో కలిసి వెళ్తున్నాయన్నారు. వెల్దుర్తి పట్టణం నుంచి 22 బస్సులలో బయలుదేరుతున్నామన్నారు. బస్సుల్లో వచ్చే వారందరికి త్రాగునీరు, ప్రసాదం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు వీరభద్రుడు, మాజీ జడ్పీటిసి ఐజయ్య, కిట్టు, సిద్దనగట్టు వెంకటేశ్వర్లు, రత్నాపల్లి ఆనంద్, మల్లికార్జున, నాయకంటి గిడ్డయ్య, హరి, రవి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని ప్రారంభించనున్న.. అభివృద్ధి పనులు..!

**(మొదటి పేజీ తరువాయి ) :**పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి ఓర్వకల్, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి పనులు, పాపాఘ్ని నదిపై వంతెన నిర్మాణం, ఎస్.గుండ్లపల్లి-కనిగిరి బైపాస్ రహదారికి ప్రధానమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.4,920 కోట్లు. ఇవి నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సంయుక్తంగా అమలు చేస్తాయి. ఈ కారిడార్లు పూర్తయితే రూ.21,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించవచ్చని, లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు సృష్టించ వచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. రాయలసీమ పారిశ్రామిక రంగానికి ఇది కీలక మలుపుగా నిలవనుంది. రోడ్ల అభివృద్ధి ప్రాజెక్టులు .. రూ.960 కోట్ల వ్యయంతో సబ్బవరం–షీలానగర్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన. .. రూ.1,140 కోట్ల వ్యయంతో పీలేరు–కాలూరు నాలుగు లేన్ల విస్తరణ ప్రాజెక్టు. .. గుడివాడ–నుజెళ్ల రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ నిర్మాణానికి శ్రీకారం. రైల్వే ప్రాజెక్టులు, రహదారి ప్రారంభోత్సవాలు .. రూ.1,200 కోట్ల వ్యయంతో కొత్తవలస– విజయనగరం నాలుగు లేన్ రహదారి ప్రారంభోత్సవం. .. పెందుర్తి–సింహాచలం రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ ప్రారంభం. .. కొత్తవలస– బొద్దవార, శిమిలిగుడ–గోరాపూర్ రైల్వే సెక్షన్లు జాతికి అంకితం. .. గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం. శివాజీ స్ఫూర్తి కేంద్ర సందర్శ నపర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదటగా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించనున్నారు. అనంతరం కర్నూలులో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొని రాష్ట్ర ప్రజలకు పలు ప్రాజెక్టులను అంకితం చేయనున్నారు.

## పెద్దపులికి పోంచి ఉన్న ప్రమాదం...!?

**(మొదటి పేజీ తరువాయి ) : ఆత్మకూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** శ్రీశైలం – నాగార్జునసాగర్ పెద్దపులుల అభయారణ్యంలో వన్యప్రానుల సంరక్షణ గాలిలో దీపంలా మారిందని చెప్పవచ్చు. ఏదో ఒక చోట చిరుతపులి లేక పెద్దపులి మృత్యుఘోష పడుతునే ఉన్నాయి. శ్రీశైలం పాతాళగంగ దగ్గర మృతిచెందిన చిరుతపులిపై అటవీశాఖ అధికార యంత్రాంగం ఒక్కసారిగా ఉలికి పాటుకు గురైన్నట్లు సమాచారం. నల్లమల అటవీ ప్రాంతంలో పెద్దపులుల, చిరుత పులులు ఎందకు మృత్యుఘోష పడుతున్నాయి. అసలు అటవీశాఖ దాచిపెడుతున్న రహస్యం ఏమిటి అనేది ఎవరికి అంతు చిక్కడం లేదు. విష పూరితమైన వ్యర్దలు అడవిలో తిని మృతి చెందుతునా న్నయా లేక శ్రీశైలం సమీపంలో ఉన్న డంప్‌యార్డు ప్రాంతంలో తిరగడంతో విష పదార్థం విస్తరిస్తుందా అనే విషయం నేటికి అంతు చిక్కడం లేదు. గత మూడు నెలల క్రితం ఓ పెద్దపులి శ్రీశైలం సమీపంలో అనారోగ్యంతో బాధపడు తున్న పులిపై అటవీశాఖ అధికారులు ఇది వరకే ప్రత్యేక నిఘా ఉంచారు. నల్లమల అటవీ ప్రాంతం లోని ముఖ్యమైన ప్రాంతాలలో అడవిలోనే డంప్‌యార్డు ఏర్పాటు చేశారనే అనుమానాలు వ్యక్తం మవుతున్నాయి. ఒకవేళ రాత్రి వేళ సమయంలో వన్యప్రానుల వేటగాళ్లు విష పూరితమైన ఆహారం అందిస్తున్నారా అనే విషయం కూడా తెలియాల్సి ఉంది. చిరుత పులికి పెద్దపులులకు తిరిగే ప్రదేశాల లో అటవీశాఖ అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసిన్నప్పటికి ఏదో ఒక రూపంలో మృత్యు ఘోష వెంటాడుతునే ఉంది. నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం – నాగార్జునసాగర్ పెద్దపులుల అభయారణ్యంలో వేటగాళ్లు ఉచ్చులతో పెద్దపులులు మృత్యుఘోష మరో వైపు నల్లమల చుట్టు నాగార్జునసాగర్, శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో జాతీయ రహదారిలో ఉండడంతో రోడ్డు ప్రమాదాలలో చిరుత పులులు మృత్యుఘోష పడుతునే ఉంటున్నాయి. ఒక్కసారిగా నల్లమల అటవీ ప్రాంతంలో శ్రీశైలం పాతళాగంగ దగ్గర చిరుతపులి మృతి చెందిన విషయంపై అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించారు. చిరుతపులి మృతికి గలకారణాలు త్వరలోనే వెలికి తీస్తాం అనే విదంగా ఆత్మకూరు వన్యప్రాని డిప్యూటి డైరెక్టర్ విఘ్నేష్ అప్పావో మీడియా ముందు వివరాలను వెల్లడించారు.

## ప్రధాని పర్యటనతో కట్టుదిట్టమైన భద్రత

**(మొదటి పేజీ తరువాయి ) :** శ్రీశైలంలో గల గంటా మఠంలో గతంలో లభ్యమైన తామ్ర శాసనాలను ప్రధాని తిలకించనున్నారు. అనంతరం ఆలయం ముందు గల గంగాధర మండపము నుండి ,నందిమండపం వరకు ప్రత్యేకమైన గ్యాలరీలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రధాని భక్తులకు అభివాదం చేసేందుకు సిద్ధం చేశారు. అనంతరం శ్రీశైలంలో గల శివాజీ మహారాజ్ స్ఫూర్తి కేంద్రమును ప్రధాని సందర్శించనున్నాడు. ప్రధాని పర్యటనకు ఏర్పాట్లన్నీ అధికారులు చక్కదిద్దారు. ప్రధాని పర్యటించే ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతను నిఘాను పోలీసులు పెంచారు. శ్రీశైలం మాడవీధులన్నీ కాషాయ మయమై దర్శనమిస్తున్నాయి. శ్రీశైలం పోలీసుల వలయంలో కట్టుదిట్టమయింది. నల్లమల అంత ప్రత్యేక బలగాలు ముమ్మరంగా జల్లెడ పట్టాయి. బాంబు స్క్వాడ్ ,డాగ్ స్క్వాడ్ లతో సెర్చ్ ఆపరేషన్లు పోలీసులు నిర్వహించారు. శ్రీశైలం కు ప్రధాని రానున్న నేపథ్యంలో 1800 మంది పోలీసులతో భద్రతను నిర్వర్తిస్తున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ శరన్ ప్రకటించారు. శ్రీశైలం క్షేత్ర అభివృద్ధికి 1650 కోట్ల రూపాయల అంచనాలతో నిధులను మంజూరు చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ప్రధానికి విన్నవం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.సుండి పెంట హెలిపాడ్ నుండి శ్రీశైలం వరకు ప్రధాని పర్యటించే రహదారి ప్రాంతాలలో దుకాణాలన్నిటిని మూసి వేయించారు. బుధవారం నాడు పోలీస్ కాన్వాయిలతో వాహనాలు ట్రైల్ రన్ నిర్వహించారు. పోలీసులు పూర్తిగా రాకపోకలను నిలిపివేయడంతో భక్తులు స్థానికులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు. శ్రీశైలం నుండి ప్రధాని మల్లన్న దర్శించుకుని తిరుగు ప్రయాణమయంత వరకు అధికార యంత్రాంగం అంతా అప్రమత్తతో ఉండడం జరుగుతుంది.

## కరివేన, ఇందిరేశ్వరం గ్రామాలలో బోధకాలు నివారణపై సర్వే



**ఆత్మకూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** రాత్రివేళ సమయంలో ప్రజలు దోమకాటుకు గురి కాకుండా ఆరోగ్య జాగ్రత్తలు ప్రతి ఒక్కరు తప్పని సరిగ్గా పాటించాలని ప్రాధామిక వైద్యాధికారులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాత్రి వేళ సమయంలో కొట్టాలచెరువు, బైర్లూటి ప్రాధామిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇందిరేశ్వరం, కరివేన గ్రామాలలో రాత్రివేళ సమయంలో బోధకాలు నివారణపై ఇంటింటి సర్వే నిర్వహించి రక్త నమునాల సేకరణ కార్యక్రమం చపట్టారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలుపద్మావతి, వసుంధర మాట్లాడుతూ ఇందిరేశ్వరం గ్రామంలో రెండు రోజుల పాటు ఆరోగ్యశాఖ ఇచ్చిన 300ల ఇళ్లకు సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. కరివేన గ్రామంలో సూపర్‌వైజర్ బ్రహ్మారాంభ ఆధ్వర్యంలో 300ల మందికి గత రాత్రి బోధకాలుపై సర్వే చేయడం జరిగిందని పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా వైద్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాత్రి వేళ సమయంలో ఇంటింటికి తిరిగి క్యూలెక్స్ దోమ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. దోమకాటు వలన వచ్చే వ్యాదులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రాత్రివేళ సమయంలో దామకాటుకు గురి కాకుండా వేపకు పొగ, దోమతెరలు ఇంటి లోపలికి దోమలు రాకుండా నివారించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశాఖ అధికారులు ఇచ్చే జాగ్రత్తలు ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో దోమకాటు నివారణపై ప్రజలు అప్రమత్తంగా లేకపోతే అంటూ వ్యాదులు సంభవించే అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. ప్రాధామిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలపై మెరుగైన సేవలు అందించే విదంగా వైద్యా ఆరోగ్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు బాస్కర్, ఇందిరా, శారద, లక్ష్మి, బయమ్మ, ఇందిరేశ్వరం సచివాలయ ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## జీఎస్టీ సభను విజయవంతం చేద్దాం



**హాలహర్వి, అక్టోబరు15, ప్రభాతవార్త;** కర్నూలులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ వరలక్ష్మీ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురువారం కర్నూలులో జరిగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ రానున్నారని తెలిపారు. ప్రధాని మంత్రి సభకు ప్రజలను తరలించేందుకు హాలహర్వి మండలానికి 10 బస్సులు కేటాయించారన్నారు. ఈ సభలో జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రజలకు వివరిస్తారన్నారు. కావునా ప్రజలకు అవగాహన కల్పించి ప్రదానమంత్రి సభకు వెళ్లేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని ఆదేశించారు. ప్రధానమంత్రి సభకు వెళ్లే వారికి భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు బాధ్యత తీసుకుని సభకు ప్రజలను తరలించేందుకు కృషి చేయాలని కోరారు. ఈఓపీఆర్డఈ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, ఓంప్రకాష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల పీపీపీ విధానాన్ని ఉపసంహరించుకోవాలి




**ఆదోనిలీగల్, అక్టోబరు15, ప్రభాతవార్త;** రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలల పీపీపీ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పీడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆదోని పట్టణంలోని మహల్తీ ఫంక్షన్ హాల్‌లో ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్ఓ) ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా పీడీఎస్ఓ రాష్ట్ర కార్యదర్శి ఎ.సురేష్ మాట్లాడుతూ పీపీపీ మెడికల్ కాలేజీల విధానానికి ఇంత వ్యతిరేకత ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదన్నారు. అంటే అందులో లాభం ఎంత ఉందో స్పష్టమవుతోందన్నారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో డజన్ల కొద్దీ ప్రభుత్వ మెడికల్ కళాశాలు ఉన్నాయన్నారు. విజయవంతంగా ప్రభుత్వ ఆధీనంలోనే నడుస్తున్నాయన్నారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పీపీపీ విధానంలోకి నెట్టేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, నాయకులు, రాజు, స్వామి, వసంత, ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేసి పర్యటించాలి




**మంత్రాలయం, అక్టోబరు 15, ప్రభాతవార్త;** ఏపీకి ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల అమలు అంశంపై కర్నూలు సభలో ప్రధాని మోదీ ప్రసంగించాలని ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్‌పటేల్, ఏఐవైఎఫ్ మండల నాయకులు ఎం.రాజు, సీపీఐ తాలూకా నాయకులు వై.భాస్కర్‌యాదవ్, సీపీఎం నాయకులు హెచ్.జయరాములు డిమాండ్ చేశారు. బుధవారం మంత్రాలయంలోని రాఘవేంద్ర సర్కిల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు మోడీ గో బ్యాక్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండులోని అంబేద్కర సర్కిల్‌లో సీపీఎం నాయకులు అశోక్ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లాకు రావడం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. విద్యార్థులకు, కార్మికులకు, రైతులకు ఇబ్బందులకు గురి చేస్తూ బహిరంగ సభలకు బస్సుల్లో, ఆటోల్లో ప్రజలను తరలించడం, ప్రజాధనాన్ని వృతా చేస్తూ ఇలాంటి సభలు నిర్వహించుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాకు వచ్చే మోదీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి కర్నూలులో అడుగు పెట్టాలన్నారు. రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, వెనకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలకు నికర జలాలు కేటాయించి కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. సీపీఎం కార్యకర్తలు అనిల్, రాజు, దానేల్, ఎలీషా, టి.ప్రాణేష్, డి.ఆంధ్రయ్య, ఏఐవైఎఫ్ నాయకులు షేక్షావలి, రాహుల్, సీపీఐ నాయకులు లక్ష్మన్‌నాయక్, గాబ్రేట్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం



**తుగ్గలి, అక్టోబరు 15, ప్రభాతవార్త:** గర్భిణీలు బాలింతలు చిన్నారులు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం భుజించడం ద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని అంగన్వాడీ సూపర్వైజర్లు అంబిక, త్రివేణి, ఏ.ఎన్.ఎం.విజయలక్ష్మి తెలిపారు. బుదవారం మండల పరిధిలోని జొన్నగిరిలోని అంగన్వాడీ సెంటర్‌లో పోషణ్ మా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు మహిళలు చేతులను శుభ్రంగా కడుక్కొని పూర్తి స్థాయిలో పొందే అహారం తినడం ద్వారా ఆరోగ్యకరమైన పిల్లలు పుట్టి రాబోయే రోజుల్లో భావిభారత పౌరులు అవుతారని వారు పేర్కొన్నారు.గర్భవతులకు శ్రీమంతాలు చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో గోబ్యాక్ మోడి అంటూ సిపిఐ నిరసనలు




**వెల్దుర్తి, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** ఏపికి ప్రత్యేకహోదా, విభజన హామీలు అమలు చేయని, వెనుకబడిన రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి ప్రకటించని భారత ప్రధాని నరేంద్రమోడి పర్యటనను వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో సిపిఐ మండల కార్యదర్శి టి.క్రిష ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేశారు. సిపిఐ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు సిపిఐ,అనుబంధ సంఘాల నాయకులతో కలిసి గోబ్యాక్ మోడి అంటూ నినాదాలు చేస్తూ నల్లప్లకార్డులు చేతపట్టుకొని ర్యాలీగా వచ్చి రాస్తారోకో చేశారు.మోడి పర్యటనతో ఏమి లాబం జరగదన్నారు. సిపిఐ నాయకులు డి.రాజు, చిన్న మాదులు, శివ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాముడు, అనిల్, శ్యాం,యశ్వంత్ పాల్గొన్నారు.

## గూడూరు గ్రంథాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు



**గూడూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** గూడూరు గ్రంథాలయ కార్యాలయంలో బుధవారం మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా గ్రంథాలయ అధికారి అబ్దుల్ కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కవిత బాయి మాట్లాడుతూ భారతమాత ముద్దుబిడ్డ ఎపిజె అబ్దుల్ కలాంను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనాలి వాటిని సాకారం చేసుకోవడానికి ప్రయత్నించాలనే స్ఫూర్తిని తెచ్చుకోవాలన్నారు. దేశానికి తమ కుటుంబాలకు ఉపయోగించబడేలా విజయాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల పాఠకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర టీడీపీ అధ్యక్షులను కలిసిన గూడూరు తెలుగు తమ్ముళ్లు



**గూడూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లాశ్రీనివాసును గూడూరు తెలుగు తమ్ముళ్లు మర్యాదపూర్వకంగా కలిసారు. కర్నూలులో జరిగే ప్రధాని పర్యటన విజయ వంతంలో భాగంగా బుధవారం కర్నూలుకు వచ్చిన టీడీపీ అధ్యక్షులను కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసారు.గూడూరులో నెలకొన్న పార్టీ విషయాల గురించి వివరించారు. ఇక్కడ టీడీపీలో ఒక వర్గానికి సరైన ప్రాధా న్యత లభించడం లేదన్నారు. స్పందించిన అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ గూడూరు తెలుగు తమ్ముళ్లతో మాట్లాడారు. పార్టీని నమ్ముకున్న వారికి తప్పకుండా సముచిత స్థానం ఉంటుందన్నారు. ఒకరి కోసం పార్టీ పుట్టలేదని, అందరి చేతులు కలిపితే పార్టీ ముందుకు పోతుందన్నారు. పార్టీని నమ్మండని, త్వరలోనే సమస్యలపై అధ్యయనం చేసి ప్రక్షాలన చేస్తామని,పార్టీకి కార్యకర్తలే మూలస్థంబాలన్నారు. అధ్యక్షుని కలిసిన వారిలో గూడూరు టీడీపీ నాయకులు నారాయణ యాదవ్‌లు ఉన్నారు.

## 4-పోషక మహా కార్యక్రమం పై అవగాహన



**కర్నూలు, అక్టోబర్ 16, ప్రభాతవార్త :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం మహిళల పోషణ పై ఆధారపడి ఉంటుందని కోడుమూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ జి.వరలక్ష్మి తెలిపారు. మండల పరిధి గార్గేయపురం నందు మంగళవారం అంగన్వాడి సెంటర్ (4) నందు పోషక మహా మాసో త్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంకు హాజరైన గర్భిణీ స్త్రీలు ,పాలిచ్చే తల్లులు, చిన్న పిల్లల తల్లిదండ్రులకు సంతులిత ఆహారం, ఫోలిక్ యాసిడు, పోషక ఆహారం స్థానికంగా లభించే వివిధ రకాల కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఆమె వివరించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, కౌమార బాలికలు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, పాల్గొన్నారు.

## గ్రంథాలయాలలో ఖాళీగా ఉన్న పోష్టులను భర్తీ చేయాలి



**పత్తికొండ, అక్టోబరు 15,ప్రభాతవార్త:** గ్రంథాలయాలలో ఎంతో కాలంగా ఖాళీగా ఉన్న లైబ్రెరియన్ పోష్టులను వెంటనే భర్తీ చేయాలని లైబ్రెరి అసోసియేట్ ప్రసిడెంట్ రైమన్ వలి, నాగరాజు, రాము డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు 25 సంవత్సరాలు కావస్తున్న ఒక్క పోష్టును కూడా జిల్లాస్థాయి, మండల స్థాయి బ్యాక్‌లాగ్ పోష్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని వారు తెలిపారు. కూటమి నాయకులు ఎన్నికలలో ఖాళీలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన ఇంత వరకు లైబ్రెరి పోష్టుల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదన్నారు. పోష్టులు భర్తీ చేయకపోవడంతో చాల చోట్ల గ్రంథాలయాలు మూతలు పడుతున్నాయని కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తు జిల్లా పర్యటనకు దేశ ప్రధాని మోడీని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లైబ్రెరి పోష్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని నిరుద్యోగ సంఘం నాయకులు కోరారు.

## మోడి పర్యటనకు సర్వం సిద్ధం చేశాం



**వెల్దుర్తి, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ సమీపంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి పర్యటనకు వెళ్లేందుకు సర్వం సిద్ధం చేశామని జిల్లా తెదేపా నాయకులు సుబ్బరాయుడు అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం ఎంపిడిఓ సుహాసినమ్మ,ఏపిఎం అనురాధ, ఏపిఓ లక్ష్మన్నతో కలిసి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది, సీనియర్‌మేట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సుబ్బరాయుడు మాట్లాడుతూ ఏపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు,డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్,మంత్రి నారాలోకేష్‌లు పట్టుబట్టి మన ప్రాంతం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో భారత ప్రధాని సభా కార్యక్రమం ఏర్పాటుచేశారన్నారు. ఈ మండలం నుంచి తెదేపా,బిజెపి,జనసేన (కూటమి నాయకులు),కార్యకర్తలతో కలిసి ఈనెల16 గురువారం ప్రత్యేక బస్సుల్లో బయలుదేరుతున్నామన్నారు.బస్సుల్లో వచ్చే వారికి ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు.మనమంతా కలిసి భారీగా ఈ సభకు తరలివెళ్లి పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు సారధ్యంలో విజయవంతం చేయాలని ఆయన కోరారు. మండల అధికారులు, సచివాలయం, రైతుసేవాకేంద్రం సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామైఖ్యసంఘం మహిళలు, విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## బొందిమడుగులలో త్రాగు నీటిని పరిష్కారించండి

**తుగ్గలి,అక్టోబరు 15,ప్రభాతవార్త:** మండల పరిధిలోని బొందిమడుగుల గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్యను తక్షణమే పరిష్కారించాలని గ్రామస్తులు కోరారు. గత కొంత కాలంగా తాగు నీటి సమస్యను తీర్చమని గ్రామ సర్పంచ్‌కు ఎన్నోసార్లు విన్నవించిన స్పంధించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాగునీటి మోటారు కాలినోయిందని బిగించేదాకా ఉండాలంటూ పొంతనలేని సమాధానం చెబుతు కాలయాపన చేస్తున్నాడని వారు వాపోయారు, ఇప్పటికైన సంభందిత అధికారులు వెంటనే స్పందించి మోటారు మరమ్మత్తులు చేయించి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్తులు కోరారు.

## కౌతాళం టీడీపీ మండలాధ్యక్షుడిగా చూడి సురేష్‌నాయుడు

**– సురేష్‌నాయుడి ఎంపిక పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం**



**కౌతాళంరూరల్, అక్టోబరు15, ప్రభాతవార్త;** కౌతాళం టీడీపీ మండలాధ్యక్షుడిగా చూడి సురేష్‌నాయుడిని, మండల టీడీపీ ఉపాధ్యక్షులుగా కురువ వీరేష్‌లను పార్టీ అధిష్టానం నియమించింది. వారి ఎంపిక పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతన మండలాధ్యక్షుడు చూడి సురేష్‌నాయుడు, ఉపాధ్యక్షులు కురువ వీరేష్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం తమను నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు.

## గోడ కూలి రెండు ఎద్దులు మృతి



**హొళగుంద, అక్టోబరు15, ప్రభాతవార్త;** మండల పరిధిలోని వందవాగిలి గ్రామంలో తీవ్ర విషాధం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... బోయ బందూరి ఉరుకుందప్ప అనే రైతుకు చెందిన రెండు కాడెద్దులు గోడ కూలి మృతిచెందాయి. దీంతో పాడి రైతు బందూరి ఉరుకుందప్పతో పాటు గ్రామస్తులంతా మృతిచెందిన కాడెద్దులను చూసి బాధతో విలపించారు. అయితే ఇలాంటి దుర్ఘటన చెందడం బాధాకరమని వాపోయారు. ప్రభుత్వం పాడి రైతుకు సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్యాకేజీని ప్రకటించని మోదీ గో బ్యాక్



**ఆదోనిటౌన్, అక్టోబరు15, ప్రభాతవార్త;** ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించని ప్రధాని నరేంద్రమోదీ గో బ్యాక్ అంటూ పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఆదోని పట్టణంలోని జిమ్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అఖండ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన హామీ ఎక్కడ అమలు చేశారని నిలదీశారు. అధికారంలోకి వచ్చాక నూతన జాతీయ విద్యావిధానం అమలు చేసి విద్యను కాషాయికరణ చేయడానికి ఈ బీజేపీ ప్రభుత్వం పూనుకుందన్నారు. నేటి విద్యార్థులకు మనదేశం కోసం పోరాడి అమరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, సర్దార్‌వల్లభాయ్ పటేల్, సావిత్రిభాయిపూలే లంటి ఎంతోమంది వీరు చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చెరిపేసి బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద చరిత్రను పాఠ్య పుస్తకాల్లో ముద్రించి నేటి విద్యార్థులకు కుల, కుతంత్రాలు, మతోన్మాదాలను రెచ్చగొట్టేవిధంగా ఈ బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన నరేంద్రమోడీకి వత్తాసు పలుకుతున్నారు. మోడీ పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు శ్రీకాంత్, శేఖర్, మోహన్, హాజీ, హుసేని, ఆచారి, పీడీఎస్‌యూ నాయకులు ఢధు, కార్తీక్, బసవ, మల్లి పాల్గొన్నారు.

## నేనే మార్పు నినాదంతో ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవం

**నందికొట్కూరు, అక్టోబరు 15, ప్రభాతవార్త :** స్థానిక బీసి వసతి గృహంలో డేటాల్ బానేగా స్వస్త్ ఇండియా క్యాంపెయిన్ డేటాలో స్కూల్ హైజీన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ రెస్కిట్ మద్దతు మరియు ఎస్ఏఆర్‌డడిఎస్ అమలు ప్రక్రియలో భాగంగా ప్రపంచ చేతులు కడుక్కునే దినోత్సవం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు చేతులు శుభ్రంగా ఉంచుకోవడంఎంత ముఖ్యమో వివరిస్తూ పరిశుభ్ర అలవాట్లను ప్రోత్సాహించడమే లక్ష్యంగా జరిగిందని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు చేతులు కడుక్కునే ఏడు దశల పద్ధతిని ప్రత్యక్ష ప్రదర్శనలతో మరియు ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా అవగాహన కల్పించారు. చేతుల శుభ్రత వల్ల వ్యాధులను నివారించగలదని ఆరోగ్యాన్ని మెరుగుపరచగలదని విద్యార్థులు గ్రహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ఎస్.బేబి పాల్గొని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం రోజువారి జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్లను అనుసరించడం ఎంత ముఖ్యమో వారికి వివరింఆరు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పిడతల పుల్లన్న, వార్డెన్ మహేశ్వరుడు విద్యార్థులు పాల్గొన్నారు.

## అబ్దుల్‌కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకం..

**– మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి**



**మంత్రాలయం, అక్టోబరు 15, ప్రభాతవార్త;** మాజీ రాష్ట్రపతి, మాజీ ఇస్రో చైర్మన్ డాక్టర్ అబ్దుల్‌కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. బుధవారం డాక్టర్ అబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా ఎమ్మెల్యే పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇస్రో చైర్మన్‌గా గర్వించదగ్గ నిర్ణయాలతో పనిచేస్తూ యావత్తు ప్రపంచం మనవైపు చూసేలా కష్టపడ్డారన్నారు. రాష్ట్రపతిగా ఉంటూ తన నిరాడంబర జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన ప్రకటన ద్వారా తెలియజేశారు.

# అందరు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యం

**: అధికారులు ప్రతిపాదనలు సకాలంలో అందించాలి – ఎంపిపి మండ్ల మల్లేశ్వరి**




**పగిడ్యాల, అక్టోబరు 15,ప్రభాతవార్త :** అందరు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి సాధ్యమవుతుందనీ జెడ్పీటిసి పుల్యాల దివ్య అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిపి మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశము జరిగింది. జెడ్పీటిసి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అందరు పనిచేయాలన్నారు. రైతులకు ఎరువులు అందక ఇబ్బంది పడుతున్నారనీ, వారి బాధలు చెప్పనలవికాదనా న్నరు. భవిషత్తులో ఈలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలుతీసుకోవాలన్నారు. స్పందించిన ఏఓ మురళీధర్ మాట్లాడుతూ 15వందల ఎకరాలు సాగుంటే 20వేల ఎకరాలుదీనికి తోడు నీటిముంపు ప్రాంతంలో రైతు పంటలు సాగువల్ల ఎరువుల కొరత ఏర్పడుతుందన్నారు. పంటనమోదు చేసుకోవడం వల్ల పండించిన పంటలు అమ్ముడానికి ఏదైనా విపత్తు జరిగితే నష్టపరహారం పొందే అర్హతవుందన్నారు. ప్రణాళికా బద్దంగా ఎరువుల కొరత ఉత్పన్నం రాకుండా చర్యలుచేపడతామనీ ఎఓ తెలిపారు. ఎంపిపి మండ్ల మల్లేశ్వరి మాట్లాడుతూ అధికారులు ప్రతిపాదనలు సమాకంలో అందించాలన్నారు.మండల అభివృద్దికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషిచేయాలనా న్నరు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలనీ, పారిశుద్ధ్య పనులు చేపట్టనందున ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారనీ, ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో వుంచుకుని పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలనీ ఎంపిపి తెలిపారు. ప్రాతకోట పశుసంవర్థకశాఖ వైద్యాధికారి డాక్టర్ డిపి.విజయభాస్కర్ మాట్లాడుతూ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుందనీ వర్షం పడితే పొటుకు ఎడుతుందనీ, 3నెలలకు ఒకసారి మందులు వస్తుంటాయనీ వాటిని భద్రపిచేందుకు ఫ్రిడ్జిలేనందున సతమతమైపోతున్నాము, పంది కొక్కుల సంచారం వల్ల చాలా ఇబ్బంది నెలకొందనీ డాక్టర్ డిపి. విజయభాస్కర్ సభదృష్టికితెచ్చారు. పచాయతీరాజ్ జెఈ జావేద్ మాట్లాడుతూ భవనంబాగాలేదనీ వర్షంవల్ల లీకేజిఅవుతుందనీ మరమ్మత్తులు చేపట్టవలసి వుందనీ సమాధానం ఇచ్చారు. ఎంపిడిఓ సుమిత్రమ్మ మాట్లాడుతూ ప్రతిపాధనలు తయారి చేసి సభదృష్టికి తెస్తే పరిష్కరించేందుకు పనిప్రాధాన్యతను బట్టి సమస్యను పరిష్కరించుకోవచ్చునీ, 10శాతం నిధులు కేటాయిస్తామనీ తెలిపారు. ఎస్సీకాలనీలో నీటిసమస్యరాకుండా జివిఎల్ఎస్ఆర్ ట్యాంకును ఏర్పాటు చేయాలనీ నెహ్రూనగర్ సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి సభదృష్టికి తెచ్చారు. ఎంపిపి మండ్ల మల్లేశ్వరి నెహ్రూనగర్, ప్రాతకోటలో వాటర్ ట్యాంకును ఏర్పాటుకు కృషిచేస్తామనీ తెలిపారు మండల విద్యాశాఖాధికారి పి. సుభాన్ మాట్లాడుతూ మేగా డిఎస్సీ వల్ల మండలంలో 99శాతం ఉపాధ్యాయుల కొరతలేదనీ, మండలంలోని వివిధపాఠశాలలలో 14మంది ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనీ ఉన్నత విద్యావంతులైన టీచర్లు ఉన్నారు అన్ని వసతులున్నాయన్నారు. పాఠశాలలను బలోపేతం చేస్తే ఎంతో ప్రయోజనం వుంటుందనీ, విద్యావ్యవస్థను నిర్లక్ష్యంచేస్తే వ్యవస్థపతనమౌతుందనీ ఎంఈఓ సుభాన్ తెలిపారు. సిడిపిఓ మంగవల్లి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణీ, బాలెంతలకు సంపూర్ణపోణ అందిస్తున్నామన్నారు. పిల్లల శాతం తగ్గిపోతుందనీ, పిల్లల తల్లదండ్రులు సెల్ఫోన్లకు దూరంగా వుంచాలనీ, ఆట, పాటలద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. ప్రాతకోటలోని ఉర్థుస్కూల్ వెనక అంగన్వాడీ కేంద్ర భవననిర్మాణం అగిపోయిందనీ, నిదులు మంజూరైన ఎందుకు పూర్తిచేయలేదనీ మండల కో-ఆప్షన్ సభ్యులు అస్లాంభాష ప్రశ్నించారు. నిదులురాలేదనీ రాగానే పూర్తిచేస్తామనీ సిడిపిఓ సమధానం ఇచ్చారు. ఎపిఓ మద్దిలేటి, ఎపిఎం కళావతి, పంచాయతీ రాజ్ జెఇ జావేద్, ట్రాన్స్కో ఎఈ క్రాంతి కుమార్, హౌసింగ్ జెఇ అనిల్కుమార్ ప్రగతి నివేదికలు చదివి వినిపాంచారు. ఈ కార్యక్రమంలో ముచ్చుమర్రి, పగిడ్యాల పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులు డాక్టర్ రాగసంధ్య, నవీన్కుమార్రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పల్లె అరుణమ్మ, ఎంపిటిసి గోపాల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు అస్లాంభాష, ఐసిడిఎస్ సూపర్వైజర్ శేషమమ, పగిడ్యాల, నెహ్రూనగర్, పి.ముచ్చుమర్రి సర్పంచ్లు పెరుమాళ్ల శేషన్న,కూరాకుల రాజేశ్వరి, ఆంజనేయులు, రెవెన్యూ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మదాసికురువ ప్రుదారి కురువ కుల పత్రాలు వెంటనే జారీ చేయాలి



**కర్నూలు, అక్టోబర్ 15, ప్రభాతవార్త ప్రతినిధి :** రాష్ట్రంలో మదాసి మదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ విషయంలో జరుగుతున్న జాప్యంపై దృష్టికి నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి గారికి తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుంకన్న మాట్లాడుతూ గతంలో మా కులస్తులకు 1956 నుండి 1985 వరకు మదాసి కురువ, మదారి కురువ ఎస్సీ ఇచ్చారన్నారు. 1986 నుండి 2000 వరకు తప్పుగా కురువ బిసి అని ఇచ్చారు, 2001 నుండి 2025 ఇప్పటి వరకు కురుబ బిసి ఇచ్చి రెవెన్యూ అధికారులు కుల మార్పిడి చేస్తున్నారని, ఒకే కులానికి చెందిన వారికి మూడు రకాల కుల పత్రాలు ఇస్తున్నారని భారతదేశంలో ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి ఏ కులానికి లేదని ఆవేదన తెలియజేయడం మైనదన్నారు,మదాసికురువ, మదారి కురువ లకు కుల సర్టిఫికెట్ జారీ విషయంలో రెవెన్యూ శాఖ నుండి జరుగుతున్న జాప్యం తొలగించి, తక్షణ చర్యలు తీసుకోవలసిందికోరారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, పలు జిల్లాలలో మదాసి కురువ మదారి కురువ వర్గానికి చెందిన ప్రజలు చాలా కాలంగా ఎస్సీ (ఎస్సీ) కుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు. అయితే, స్థానిక రెవెన్యూ అధికారులు ఈ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అంతేకాక, కొందరు అధికారుల నిర్లక్ష్యం లేదా అవగాహన లోపం కారణంగా, మదాసి మదారి కురువ (ఎస్సీ) వర్గానికి చెందిన అభ్యర్థులకు ఎలాంటి విచారణ లేకుండా కురుబ కురుమ (బిసిబి.11) కుల సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారన్నారు. దీని వలన విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలలో హక్కుగా దక్కాల్సిన ప్రయోజనాలు కోల్పోతున్నారన్నారు. అందువల్ల, మదాసి కురువ, మదారి కురువ వర్గానికి సంబంధించి సరైన కుల ధృవపత్రాల జారీకి తగిన ఆదేశాలు జారీ చేసి, అధికారులు జాప్యం లేకుండా న్యాయం చేయాలని, అదేవిధంగా, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి మరియు 16వ తేదీన కర్నూలుకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కి కూడా నివేదించి, ప్రభుత్వ స్థాయిలో స్పష్టమైన నిర్ణయం తీసుకోవలసిందిగా కోరుచున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భరత్ కుమార్, జయ ప్రకాష్, రాయలసీమ రవికుమార్, రాము, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగసభకు అధికారులు సన్నద్ధం

**పగిడ్యాల, అక్టోబరు 15,ప్రభాతవార్త :** భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ కర్నూలు జిల్లాకు గురువారం వస్తున్న సందర్భంగా భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు జనానిన తరలించేందుకు బుధవారం సాయంత్రం అధికారులు సన్నద్ధం అయ్యారు. సాయంత్రానికి పగిడ్యాల మండలానికి ఏపిఎస్ఆర్టిసి బస్సులు 32, ప్రైవేట్ బస్సులు 8 మొత్తం 42 బస్సులు కేటాయించారు. మండలంలోని వివిధగ్రామాలకు వాహనాలు చేరుకున్నాయి. ఎంపిడిఓ సుమిత్రమ్మ స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. జనసమీకరించి వారిని వాహనాలల్లో తీసుకుని వెళ్లడం బహిరంగసభ అనంతరం తిరిగి వారి గమ్యస్థానాలకు చేర్చేబాధ్యతలను ఎపిఎం కళావతి, ఎపిఓ మద్దిలేటి, డీఆర్డిఏ, డ్వామా, సచివాలయ సిబ్బంది, డిజిటిల్ అసిస్టంట్లకు తదితర శాఖలకు అప్పగించారు. సింగిల్ విండో అధ్యక్షుడు బొగ్గుల దామోదరెడ్డి, వాసురెడ్డి, విజయ్నాయుడు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్కళ్యాణ్ మంత్రులు రాగమయూరి వద్ద ఏర్పాటు చేసిన భారీబహిరంగ సభలో అందరు పాల్గొని జయప్రదం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో హనుమన్న టిడిపి, జనసేన, బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్పై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్



**కొలిమిగుండ్ల, అక్టోబర్ 15, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ అదేశాల మేరకు ఈనెల 17న మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సిజెఐ బిఆర్ గవాయ్ దళితుడు కావడం వల్ల అహంకారంతో దాడిజరిగిందని ఇది ఒక దళిత వ్యక్తిపై జరిగిన దాడి కాదని ప్రజాస్వామ్యంపై, న్యాయవ్యవస్థపై రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తు ఈదాడికి పాల్పడినవారిని ప్రొత్సహించిన శక్తులకు శిక్షపడేవిధంగా చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధపెట్టాలని డిమాండ్ చేస్తు ఈనెల 17న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల మండల కేంద్రంలో నిరసన ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అధ్యక్షులు తోళ్ళ నాగాంజనేయ, గోపాల్, దస్తగిరిలు తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించే నిరసన ప్రదర్శనకు మండలంలోని అన్నిగ్రామాల నుండి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రతిఒక్కరు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.ఈకార్యక్రమంలో మందా వెంకటేశ్వర్లు, తోళ్ళ వెంకటరామయ్య, తోళ్ళ మోహన్, సికాయి చంద్ర, లింగాల దస్తగిరి, గోపాల్ గారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైపర్లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జన్మదిన వేడుకలు

**కర్నూలు విద్య, అక్టోబర్ 15, ప్రభాతవార్తః**



కర్నూలు నగరంలోని ఏ క్యాంపు నందు గల మైపర్ ఫార్మసీ కళాశాలలో భారత మాజీ రాష్ట్రపతి డా. ఏపీజే అబ్దుల్ కలాం జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యొక్క జీవిత విశేషాలు, వారి సేవలు భారతదేశానికి, అభ్యున్నతికి వివిధ రకాలుగా కృషిచేశారని విద్యార్థులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం రాజ్కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, కాకర్ల ప్రశాంత్, ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## డీఈవో ఆదేశాలు పాటించని చైతన్య స్కూల్



**పత్తికొండ, అక్టోబరు 15, ప్రభాతవార్త :** ఈ నెల 16న దేశ ప్రధాని ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్నందున జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించారు. అయితే బుధవారం పట్టణంలోని చైతన్య విద్యా సంస్థ విద్యార్థులు హాజరయి యధావిధిగా పనిచేస్తుండడంతో బిజెపి కో కన్వీనర్ గోవర్ధన్, జిల్లా కార్యదర్శి బోయ బ్రహ్మయ్య, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, కరణం వినోద్కుమార్, టిడిపి నాయకుడు మునిస్వామి, మండల ప్రధాన కార్యదర్శి వీరేష్, చక్రాల సందర్శించి ప్రభుత్వ ఆదేశ్యాలనే నిర్లక్ష్యం చేస్తున్నారని, అధికారుల ఆదేశాలు పట్టించుకోరా అంటు విద్యార్థులను ఇళ్ళకు పంపి ప్రన్సిపాల్పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆంధ్ర రాష్ట్ర ద్రోహి నరేంద్ర మోడీ.. : సిపిఎం



**ఆలూరు,అక్టోబరు 15,ప్రభాతవార్త:** రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో గో బ్యాక్ నరేంద్ర మోడీ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని కామ్రేడ్ జ్యోతిబసు భవన్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేసి గో బ్యాక్ నరేంద్రమోడీ అంటూ నినాదాలు చేస్తు నిరసన తెలిపారు. సిపిఎం తాలుకా నాయకులు కేసి నారాయణస్వామి మాట్లాడుతు ప్రధాని రాష్ట్ర విభజన హామీలను అమలు చేయకుండా రాష్టానికి ద్రోహం చేశారని, విభజన హామీలలో భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కర్నూలులో రైల్వేగూడ్స్ వ్యాగెన్, కడప ఉక్కు పరిశ్రమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజ్ వంటి వాటిపై నిర్లక్ష్యం చేయడం జరిగిందని అన్ని పరిష్కారించి రాష్ట్రంలో పర్యటించాలని వారు కోరారు. నాయకులు రామాంజనేయులు, షాకీర్, మైన గోవర్ధన్, ఈరన్న, నాగరాజు, శవేఖర్ పాల్గొన్నారు.

## తంగరడోన నుంచి శబరిమలై కు పాదయాత్ర



**ఆస్పరి,అక్టోబరు 15,ప్రభాతవార్త:** మండల పరిధిలోని తంగరడోన గ్రామంలో అయ్యప్పస్వామి ఆలయంలో గురుస్వామి నల్లన్న స్వామి, వీరేష్స్వామి ఇరుముడి కట్టుకొని బుధవారం పాదయాత్రగా స్వామివారి దర్శనానికి బయలు దేరారు. వీరు మహామండలం 108 రోజులు స్వామివారి మాల ధరించి కఠోర దీక్షతో నియమ నిభంధనలు పాటిస్తూ అత్యంత భక్తిశ్రద్దలతో దాదాపు 1280 కిలోమీటర్లు పాదయాత్రగా వెళ్ళి శశబరిమలైలో శ్రీశ్రీశ్రీ అయ్యప్పస్వామిని దర్శించుకుంటామని గురుస్వామి తెలిపారు. అలాగే ఆదోని పట్టణం నుంచి పది మంది ఇరుముడితో ఆస్పరి మీదుగా శబరిమలైకు బయలుదేరారు.

## ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం



**ఆస్పరి, అక్టోబరు 15,ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో నేడు జరగనున్న సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్రమోడీ పర్యటనను విజయవంతం చేద్దామని ఆలూరు నియోజకవర్గం టిడిపిఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి, పార్టీ పరిశీలకులు గంజి నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కపట్రాళ్ళ బుజ్జమ్మ, శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ సత్తిబాబు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన ఆస్పరిలో ఎంపిడివో కార్యాలయంలో ఎంపిడివో గీతావాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రధాని మోడీ, సి.యం.చంద్రబాబునాయుడు, డిప్యూటి సి.ఎం..పవన్ కళ్యాణ్ పర్యటనకు సంభంధించిన ఏర్పాట్లపై సమీకరణ రవాణా తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సొసైటి మాజీ డైరెక్టర్ కృష్ణయాదవ్, ఆలూరు మార్కెట్యార్డు చైర్మన్ వెంకటేష్, మండల పార్టీ మండల కార్యదర్శి శేషాద్రినాయుడు, ఎంపిటిసి నరసప్ప, వరదరాజులు, కొంకరా మధు, జనసేన మండల కన్వీనర్ అరవింద్, శాలిసాహెబ్, రవిరెడ్డి,శేషిరెడ్డి, రాజ్కుమార్, వేణు, దర్గయ్య, గోవిందు, కృష్ణమూర్తి, శ్రీనువవాసులు, మునిస్వామి, పక్కీరప్ప, ఏపిఎం జనార్ధన్, హౌసింగ్ ఏఈ అంజలి పాల్గొన్నారు.

## ప్రారంభానికి ముస్తాబైన రుద్రవరం టోల్ప్లాజా



**పాములపాడు, అక్టోబర్ 15, ప్రభాతవార్తః** కర్నూలు నుండి అమరావతికి 340సి ఎక్స్ప్రెస్ జాతీయ రహదారిపై పాములపాడు మండలంలో రుద్రవరం టోల్ప్లాజా ప్రారంభానికి సర్వం సిద్ధంచేశారు. కర్నూలు నుండి ఆత్మకూరు వరకు జాతీయ రహదారి దాదాపు అక్కడక్కడ ఫైల్ ఓవర్ పనులు మినహా రోడ్లు పనులు పూర్తి అయ్యాయి. రెండునెలల్లోపు జాతీయ రహదారి పనులు పూర్తిచేసే అవకాశం ఉందని ఈ జాతీయ రహదారి పూర్తి అయితే కర్నూలు నుండి అమరావతికి వాహనదారులకు ప్రయాణం సులభతరంగా ఉంటుంది. ఈరహదారిపై వాహనాలు వేగంగా పరుగెడుతాయి. రోడ్డుపనులు పూర్తికావడంతో ప్రయాణికులకు, వాహనదారులకు అత్యంత సౌకర్యంగా జాతీయ రహదారి ప్రయాణం సాగుతుంది.

## కప్పట్రాళ్ల గ్రామాన్ని సందర్శించిన ఆఫ్రికా దేశస్థులు

**– ఐజీ ఆకే రవికృష్ణ గ్రామంలో చేపట్టిన సేవలు భేష్**
**– ప్రజలతో ముచ్చటించిన ఆఫ్రికా, ఇతర రాష్ట్రాల ఎన్ఐఆర్డీ యంగ్ ప్రొఫెషనల్స్**



**దేవనకొండ, అక్టోబరు15, ప్రభాతవార్త;** ఐపీఎస్ అధికారి, ఐజీ ఆకే రవికృష్ణ దత్తత గ్రామమైన కప్పట్రాళ్ల గ్రామంలో బుధవారం ఆఫ్రికా దేశస్థులు, భారతదేశంలోని మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 8 మంది ఎన్ఐఆర్డీ యంగ్ ప్రొఫెషనల్స్ పర్యటించారు. మూడు రోజులుగా గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆఫ్రికా దేశ ప్రతినిధి ఫైనీలూమ్ గ్రామంలోని పొదుపు మహిళా సంఘాలు, రైతులు, విద్యార్థులతో చర్చించి ఐజీ ఆకె రవికృష్ణ చేసిన గ్రామాభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆఫ్రికా దేశ ప్రతినిధి మాట్లాడుతూ గ్రామంలో ఎంతో మార్పు కనిపిస్తోందన్నారు. పొదుపు సంఘాల మహిళలు స్వశక్తితో ఎదుగుతున్నారన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతున్నారని, విద్యార్థులు చదువులో ప్రగతి సాధిస్తున్నారన్నారు. గ్రామానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కప్పట్రాళ్ల మార్పు దేశానికే ఆదర్శమన్నారు. గ్రామంలో స్త్రీ శక్తి భవన్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళ్యాణ మండపం, మినరల్ వాటర్ప్లాంట్, సీసీ రోడ్లు, అంగన్వాడీ సెంటర్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ జ్యోతి సంస్థ ద్వారా అనేక మందికి జీవనోపాధి కార్యక్రమాలు, మహిళా శక్తి వికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. సే ట్రీస ద్వారా ఉచితంగా పండ్ల మొక్కలను పంపిణీ చేస్తూ పచ్చదనం పెంపొందించారన్నారు. గ్రామంలోని చెరువులను పున:రుద్ధరించి నీటి వనరులను మెరుగు పరిచారన్నారు. దత్తత తీసుకున్నప్పటి నుంచి ఆకే రవికృష్ణ గ్రామ ప్రజలతో మమేకమై గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని యంగ్ ప్రొఫెషనల్స్ ప్రశంసించారు. అనంతరం ఐజీ ఆకే రవికృష్ణ వర్చువల్గా యంగ్ ప్రొఫెషనల్స్తో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫైనీలూమ్ (ఆఫ్రికా), క్షితిష్రాజ్ (బీహార్), హార్విక్ కన్నా (మధ్యప్రదేశ్), తుషార్ కౌశిక్ (ఉత్తర ప్రదేశ్), సౌరబ్పాటిల్ (మహారాష్ట్ర), సంపత్కుమార్ (తెలంగాణ), సుమన్చౌహాన్ (తెలంగాణ), సతీష్కుమార్ (ఆంధ్రప్రదేశ్), గ్రామ జ్యోతి మేనేజర్ బి.నారాయణ, సిబ్బంది సుధాకర్, సరిత, రాజేశ్వరి, ఫర్జానా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మూడు నెలలకొకసారి జరిగే.




**హొళగుంద, అక్టోబరు15, ప్రభాతవార్త;** మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజాప్రతినిధులు అధికారులపై మండిపడ్డారు. ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన ఎంపీడీఓ విజయ లలిత ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరుకావాలని, ఐదు రోజుల క్రితమే సమాచారం అందించినా, విద్యుత్ శాఖ ఆర్టీసీశాఖ అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ఎంపీడీఓను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎంఈఓ సుధారాణి మాట్లాడుతూ మండలంలో 39 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రైవేట్ పాఠశాలలు, ఒకటి కేజీబీవీ పాఠశాల ఉన్నాయన్నారు. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ-2025 ద్వారా మండలంలో 80 శాతం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామన్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడంతో కొత్త కళ వచ్చిందన్నారు. ఇందులో 101 ఎస్జీటీ, 63 మంది స్కూల్ అసిస్టెంట్లు, మొత్తం 164 మంది ఉపాధ్యాయులు వచ్చారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు ఈ సందర్భంగా ధన్యావాదాలు తెలిపారు. ఏపీఓ తిమ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎన్జీఆర్ఎస్ పరిధిలో గోకులంషెడ్ల నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. అయితే అసలైన అర్హులకు గోకులంషెడ్లు లబ్ధి చేకూరలేదని అధికారులను ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఏడీఏ చెంగల్రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ 2025కు సంబంధించి మండలంలో 48 వేల ఎకరాల వ్యవసాయ భూములకు గానూ 37 వేల ఎకరాలకు ఈ క్రాప్ బుకింగ్ జరిగిందన్నారు. అయితే రైతులు ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ భూముల్లో సాగుచేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చేయడం పట్ల అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని గజ్జహళ్లి గ్రామ వైస్ ఎంపీపీ మహాదేవమ్మ తనయుడు కెంచెప్ప ఏడీఏ చెంగల్రాయుడిని ప్రశ్నించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ శివరాణి మాట్లాడుతూ మండలంలో చాలావరకు అంగన్వాడీ సెంటర్లకు సొంత భవనాలు లేవని, గ్రామ సర్పంచు, సంబంధిత అధికారుల తీర్మానం, 3 సెంట్ల స్థలం యొక్క స్కెచ్ అందిస్తే సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయాశాఖల అధికారులు వారివారి శాఖల గురించి వివరించారు.

## వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చండి

**చిప్పగిరి, అక్టోబర్, 15, ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్లోని వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని ఎన్నికల్లో రాయలసీమ గడ్డపై తిరుపతిలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాట ఏమైందని, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆలూరు తాలూకా వాల్మీకి యువ నాయకులు దేగులపాడు జూటూరు మారయ్య పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వాల్మీకులు అధిక శాతం ఉన్నారని, ఆర్థిక రాజకీయ సామాజిక రంగంలో వెనకబడి ఉన్నారని, దీంతో ఎస్టీ జాబితాలో కేంద్రం చేర్చి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పక్క రాష్ట్రం కర్ణాటకలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో కొనసాగుతున్నారని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా నాలుగు జిల్లాలు ఎస్టీలుగా ఉన్నాయి, మిగతా జిల్లాల్లో బీసీలుగా మిగిలిపోవడం ఏమిటని, వారిని కూడాఎస్టీలుగా వాల్మీకులను చేర్చాలని మారయ్య డిమాండ్ చేశారు. ప్రధాని మాట నిలబెట్టుకోవాలని, నేడు కర్నూలు జిల్లా లో జీఎస్టీ పై బహిరంగ సభకు విచ్చేయుచున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీని కోరారు. గతంలో ఆంధ్రప్రదేశ్లో వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చాలని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు కూడా గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్రంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ వాల్మీకులపై చొరవ చూపి ఎస్టీ జాబితాలో తక్షణమే చేర్చాలని కోరారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో పరిపాలన సాగిస్తున్నారు అయితే వాల్మీకులను ఓట్ల కోసం మాత్రమే చూస్తారా..? లేక వారి అభివృద్ధిని కూడా చూస్తారని ప్రశ్నించారు. తక్షణమే కేంద్రంలో వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి అన్నారు.

## ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలపై మోదీ ప్రసంగించాలి




**దేవనకొండ, అక్టోబరు15, ప్రభాతవార్త;** ఏపీకి ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీల అమలు అంశంపై కర్నూలు సభలో ప్రధాని మోదీ ప్రసంగించాలని సీపీఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, సీపీఐ మండల కార్యదర్శి ఎం.నరసారావుల డిమాండ్ చేశారు. బుధవారం దేవనకొండలో సీపీఐ, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మోడీ గో బ్యాక్ కార్యక్రమంలో భాగంగా గ్రామపురవీధులగుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండులోని అంబేద్కర్ సర్కిల్లో సీపీఎం నాయకులు అశోక్ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లాకు రావడం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. విద్యార్థులకు, కార్మికులకు, రైతులకు ఇబ్బందులకు గురి చేస్తూ బహిరంగ సభలకు బస్సుల్లో, ఆటోల్లో ప్రజలను తరలించడం, ప్రజాధనాన్ని వృథా చేస్తూ ఇలాంటి సభలు నిర్వహించుకుంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. కర్నూలు జిల్లాకు వచ్చే మోదీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి కర్నూలులో అడుగు పెట్టాలన్నారు. రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, వెనకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలకు నికర జలాలు కేటాయించి కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. వామపక్ష పార్టీల నాయకులు యూసుఫ్, సూరి, బజారి, కె.పి.రాముడు, సుధాకర్, కండప్ప, పాండురంగడు, హరిచంద్ర, మహేంద్ర, సుభాన్, నాగేంద్రబాబు, రంగన్న, మమేష్, రామంజి, రఫీ, శ్రీనివాసులు, విజయ్, రాము, కోదండ, భాస్కర్, సుబ్బయ్య, బలరాం పాల్గొన్నారు.

## మోదీ గో బ్యాక్ అంటూ వామపక్షాల నిర్వసన

**కోడుమూరు, అక్టోబర్ 15, ప్రభాతవార్త ః**




జీఎస్టీ విజయోత్సవ కార్యక్రమానికి కర్నూలు పర్యటనకు వస్తున్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ గో బ్యాక్ అంటూ స్థానిక వామపక్షాలైన సిపిఐ, సిపిఎం పార్టీలు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. బుధవారం స్థానిక కోట్ల సర్కిల్ దగ్గర చేపట్టిన నిరసన కార్యక్రమంలో వామపక్షాల నాయకులు భారీ ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వామ పక్షాల ప్రతినిధులు మాట్లాడారు. గత 11 ఏళ్ల బిజెపి పాలన సాగిస్తున్న పిఎం నరేంద్రమోదీ భారత దేశానికి చేసింది ఏదీ లేదన్నారు. దేశ వ్యాప్తంగా కార్మిక రంగాలను అదోగతి పాలు చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ విభజన చేసి గత పదేళ్ల కాలం దాటినా ఇంత వరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించలేక పోయ్యారన్నారు. బిజెపి ప్రాంతాలను మాత్రమే అభివృద్ధి చెందాయి కానీ ఆంధ్రప్రదేశ్లో అభివృద్ధి జరగలేదన్నారు. బిజెపి పాలన అంతా పెట్టిబడి రంగాలకే ఉపయోగపడుతోందన్నారు. కర్నూలు జిల్లాలో బిజెపి పాలనకు సంబంధించిన అభివృద్ధి ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. దేశంలో నలుమూలలా రహదారులు మెరుగుపడుతున్నా వెనుకబడిన ప్రాంతమైన కర్నూలు నుంచి బళ్లారి వేళ్లే రహదారికి మోక్షం కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధిని మర్చిన బిజెపి ప్రభుత్వ పాలనపై త్వరలో ప్రజా పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వామపక్షాల నాయకులు బి.రాజు, గఫూర్మియ్యా, శేషుకుమార్, ఈరన్న, లక్ష్మన్న, భాష, పెద్దయ్య, రాజు, గోవిందు, అలీసా, మధు, భాష, గిడ్డయ్య, మహేష్ పాల్గొన్నారు.

**NATIONAL SEEDS CORPORATION LIMITED**
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11,Tukaram Gate, Lalaguda, Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

**NOTICE INVITING TENDER**

Tenders are invited for **"Leftover Construction work of Precast Compound wall, Steel Board and Writing work on steel board at Production Center, Gooty under Area Office, NSC, Kurnool.** The Bid may be seen and downloaded from NSC website https://www.indiaseeds.com/ and e-nivida portal https://indiaseeds.enivida.com. The last date for submission of Bids is **28.10.2025 at 02.30 P. M. and will be opened on same day at 03.30 P.M.** The detailed terms and conditions can be seen from tender documents.
Any changes will be placed only on NSC web-site.

F. No. Engg (Gooty-Boundary wall)/
NSC: HYD/25-26/
DATED 14.10.2025

GAJANAND SINGH
REGIONAL MANAGER

# ప్రధాని పర్యటనపై మంత్రి అచ్చం నాయుడు సమీక్ష

: కార్యక్రమం విజయవంతం చేయాలని సూచన
: ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలన



**కర్నూలు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** ప్రధాని నరేంద్ర మోదీ గారు కర్నూలు పర్యటన సందర్భంగా నిర్వహించనున్న "సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" బహిరంగ సభ ఏర్పాట్లపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, గుమ్మడి సంధ్యారాణి, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా, సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు, కార్యకర్తలు ఒకే బృందంలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, సభా ప్రాంగణం, భద్రతా వ్యవస్థలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. "సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్" సభ దేశ ఆర్థికాభివృద్ధి మరియు ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ప్రజల ముందుంచే వేదికగా నిలుస్తుందని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి ప్రజలతో నేరుగా మమేకమవుతున్న ఈ సభ చారిత్రాత్మకంగా నిలవాలని ఆకాంక్షించారు. సభా విజయవంతం కోసం కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉత్సాహం నింపి, ప్రతి గ్రామం, మండలంలో సభ ప్రాధాన్యతను వివరించాలని ఆయన సూచించారు. సభా ప్రాంగణం, వేదిక, భద్రత, పార్కింగ్, నీటి సదుపాయాలు, మీడియా సౌకర్యాలు, వాలంటీర్ వ్యవస్థ వంటి అంశాలపై మంత్రి విస్తృతంగా సమీక్షించి, సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు. ప్రధాని పర్యటన రాష్ట్రానికి కొత్త అవకాశాల ద్వారాలు తెరుస్తుందని, ఈ సభ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి యాత్రకు నూతన దిశా నిర్దేశం చేసే ఘట్టంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు.

# మీడియా ఏర్పాట్లు పరిశీలించిన సమాచార శాఖ డైరెక్టర్ విశ్వనాథన్

సూపర్ జీఎస్టీ థీమ్ సాంగ్ మ్యూజిక్ పై సూచనలు



**కర్నూలు, అక్టోబర్ 15, ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న కర్నూలులో నిర్వహించనున్న "సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్" బహిరంగ సభకు సంబంధించి మీడియా ఏర్పాట్లను సమాచార శాఖ డైరెక్టర్ కే.ఎస్. విశ్వనాథన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా వారికి భోజన, వసతి ఏర్పాట్లను పరిశీలించి, సమయానికి లంచ్, త్రాగునీరు, స్నాక్స్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మీడియా గ్యాలరీలో పాత్రికేయులు మినహా ఎవరినీ అనుమతించకూడదని, సీటింగ్ అరేంజ్‌మెంట్స్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత్రికేయులు సులభంగా చేరుకునేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిపీల గ్యాలరీలు, ప్రధానమంత్రి రాక మార్గం, ప్రధాన వేదిక, బారికేడ్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. పీఏ సౌండ్ సిస్టమ్, ప్రొడక్షన్ రూమ్, ఆడియో-వీడియో మిక్సింగ్ యూనిట్లు ఎటువంటి లోపాలు లేకుండా ఇంజినీరింగ్ అధికారులు సర్దిపై చేయాలని సూచించారు.



అలాగే జీఎస్టీ థీమ్ సాంగ్, ఎల్సీడీ స్క్రీన్‌లు, సౌండ్ స్పీకర్లు సక్రమంగా పనిచేస్తున్నాయా అని తనిఖీ చేశారు. తదనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల గ్రీన్ రూమ్‌లను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జోన్-4 ఆర్జెడి మహబూబ్ బాషా, సమాచార శాఖ డీడీ జయమ్మ, ఆర్ఐలైన సివి కృష్ణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, అనంతపురం డీఐపిఆర్ఓ బాలకొండయ్య, తిరుపతి డీఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, ఏఈఈలు, డివిజనల్ పిఆర్వోలు, సమాచార శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కర్నూల్ మెడికల్ కాలేజీలో ప్రపంచ అనాటమీ దినోత్సవం



**కర్నూల్ హాస్పిటల్ అక్టోబర్ 15 ప్రభాతవార్త**

వైద్యులు శరీర నిర్మాణ శాస్త్రంలో పట్టు సాధిస్తే మంచి వైద్యులుగా రాణిస్తారు"... "అక్టోబర్ 15 ప్రపంచ అనాటమీ దినోత్సవం".... యువ వైద్యులు శరీర నిర్మాణ శాస్త్రంలో మంచి పట్టు సాధిస్తే రోగనిర్ధారణ, చికిత్సలో మంచి ఫలితాలు సాధిస్తారని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ అన్నారు. అక్టోబర్ 15 ప్రపంచ అనాటమీ దినోత్సవం సందర్భంగా మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి వైద్యుడు మొట్టమొదటగా శరీర నిర్మాణ శాస్త్రాన్ని తెలుసుకుంటేనే వైద్యరంగంలో ముందుకు వెళ్లగలదని అన్నారు. ప్రపంచ ఆధునిక మానవ శాస్త్ర నిర్మాణ స్థాపకుడు ఆండ్రియాస్ వేసాలియస్ మరణించిన వారోత్సవాన్ని పురస్కరించుకొని ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ అనారమీస్ట్సు "గ్లోబల్ పర్స్పెక్టివ్స్ ఆఫ్ అనాటమిని" 2025 సం. థీమ్ ప్రకటించిందని ఆమె తెలిపారు. విద్యార్థులు ప్రత్యేకంగా శరీర అంతర్గత నిర్మాణాలను బాడీ పెయింటింగ్స్ లో చూపిన విధానం చక్కగా వుందని, రంగులతో వేసిన విధానం బాగుందని కొనియాడారు. బాడీ పెయింటింగ్, శరీర అంతర్గత బాగాల ఆర్ట్ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ప్రిన్సిపల్ వైస్ ప్రిన్సిపల్ సాయి సుధీర్ కమ్యూనిటీ విభాగపు అధిపతి డాక్టర్ సుధాకుమారి వ్యవహరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్, పి.జి డా. రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు



**కొత్తపల్లె, అక్టోబర్ 15, ప్రభాతవార్తః** మండలంలోని నందికుంట గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వైసీపీని వీడీ తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం టిడిపి మండల నాయకులు జహరుల్లా ఆధ్వర్యంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, వైసీపీ కార్యకర్తలు శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వార్డు మెంబర్లు చిన్నశంకర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిలతో పాటు పలువురికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి వైసీపీ పార్టీ నాయకులు టీడీపీలోకి రావడం జరుగుతుందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే నందికొటూ ్కరు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో కూడ నియోజకవర్గం నుండి మరింత మంది వైసీపీ నుంచి టీడీపీలోకి రావడం జరుగుతుందన్నారు. అనంతరం టీడీపీలోకి వచ్చిన నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న చూసి టీడీపీ పార్టీలోకి రావడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో టీడీపీ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తామన్నారు.

# కలలను సాకారం చేయడం యువత లక్ష్యంగా పెట్టుకోవాలి

– బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



**కర్నూలు విద్య, అక్టోబర్ 15, ప్రభాతవార్తః** అబ్దుల్ కలాం కలలను సాకారం చేయడమే యువత లక్ష్యంగా పెట్టుకోవాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ తెలిపారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నగరంలోని సిల్వర్ జూబ్లి కళాశాలలో ఏ పి జె అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈసందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ పివి నరసింహారావు ప్రారంభించబడ్డ కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి చేయడం గొప్ప పరిణామం అన్నారు. కలాం శాస్త్రవేత్తగానే కాకుండా గొప్ప దూరదృష్టి గల నాయకుడని ప్రపంచ దేశాలు భారతదేశాన్ని గౌరవంగా చూసేలా చేసిన వ్యక్తి అని ఆయన జీవితమంతా క్రమశిక్షణ, జ్ఞానం, కృషికి ప్రతీక అన్నారు. నేటి యువత కలాం జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి కృషిచేయాలన్నారు. దేశ రక్షణ వ్యవస్థకు అణుశక్తిని జోడించిన మిసైల్ మ్యాన్, క్షిపణి శాస్త్ర విజ్ఞాన రంగంలో చిరస్మరణీయ సేవలు అందించిన భారత రత్న స్వర్గీయ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆ మహోనీయుని సేవలు స్మరించుకుంటూ భావితరాలకు ఉజ్వలభవిష్యత్తు అందించాలన్న తపనతో "కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి" అంటూ ఆయన ఇచ్చిన సందేశాలు యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, మైనార్టీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, నేతలు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధాని నరేంద్రమోడీ పర్యటన సూపర్ హిట్ కావాలి

– రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు



**కౌతాళం రూరల్, అక్టోబరు15, ప్రభాతవార్త;** ఈనెల 16న కర్నూలు జిల్లాలో పర్యటించనున్న భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ పర్యటన సూపర్ హిట్ కావాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలకేంద్రమైన కౌతాళంలోని రాజనగర్ క్యాంపు వేదికగా ప్రధాని మోదీ పర్యటనకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, నాగేశ్వరరావు, ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, పరిశీలకులు నెట్టు వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షులు ఉలిగయ్య దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకుని మోదీ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ప్రపంచం మన ప్రధాని మోదీ రాక కోసం ఎదురు చూస్తోందని, అలాంటి ప్రఖ్యాత గల మోదీ మన జిల్లాకు రావడం శుభ పరిణామమన్నారు. ఈ మహోత్తరమైన పర్యటనను మనం దిగ్విజయం చేయాలని కోరారు. ఎవరికీ ఎలాంటి లోటు రాకుండా ఇటు ప్రభుత్వ అధికారులతో పాటు మన నాయకులు సమన్వయం చేసుకుంటూ రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయిబాబా, అడివప్పగౌడ్, సింగిల్ విండో చైర్మన్‌లు అల్లూరి వెంకటపతిరాజు, బోయ మారెప్ప, టీబీపీ చైర్మన్ టిప్పుసుల్తాన్, యువ నాయకులు రాకేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు పట్టాభి, సాద్రి బసవరాజు, రామలింగ, సుబ్రహ్మణ్యరాజు, కురువ వీరేష్, టౌన్ అధ్యక్షులు డా.రాజానంద్, జనసేన నాయకులు రామాంజనేయులు, చిన్న, బీజేపీ రమేష్, విజయ్, అయ్యప్ప, గిరి, ముక్కన్న, నరసప్ప, ఈరన్న, బసవరాజు, భూషణ్‌గౌడ్, నాగరాజుగౌడ్, సన్నప్ప, అల్లయ్య, గట్టూరు ఉసేని, సోమనాథ్, శంకర్, తిక్కయ్య, నభిసాబ్, కురువ నాగేష్, లక్కే గోవిందు, గోపాల్, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జీఎస్టీ పండుగ కాదు.. జీఎస్టీ దండగ

: మోడీ పల్లకి మోస్తున్న చంద్రబాబు జగన్మోహన్రెడ్డి.. : వామపక్షపార్టీ నేతలు





**కర్నూలు అక్టోబర్ 15 ప్రభాతవార్త ప్రతినిధి:** జీఎస్టీ పండగ కాదు, జీఎస్టీ దండగ కార్యక్రమమని సీఎం చంద్రబాబునాయుడు ప్రదాని మోడీ మెహర్బాణి కోసం కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నారని, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, వైసీపీ నేత జగన్మోహన్రెడ్డిలు ఇరువురు మోడీ పల్లకి మోస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీ రామచంద్రయ్యలు విమర్శించారు. అంతకు ముందు వామపక్షపార్టీల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు గోబ్యాంక్ మోడీ అంటూ నినాదాలు చేస్తూ నల్లజెండాలతో బారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు బి.గిడ్డయ్య, గౌస్ దేశాయ్ అధ్యక్షతన నిరసన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రదాని నరేంద్రమోడీని శ్రీశైలం మల్లిఖార్జునుడు క్షమించడన్నారు. మతోన్మాది మోడీని మల్లన్న సహించడన్నారు. మోడీ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఏమి సాధించారని జీఎస్టీ పండుగ చేసుకుంటున్నారని విమర్శించారు. కర్నూలులో పత్తికొండలో టమోటా రైతులు, కర్నూలులో ఉల్లి రైతులు గిట్టుబాటు ధరలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా రని తెలిపారు. 13వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్న మోడీ ఆదోనిలో టెక్స్టైల్ పార్కు, పత్తికొండలో టమోటా జ్యూస్ ప్యాక్టరీ, కడపలో ఉక్కుప్యాక్టరీ నిర్మాణం ఎందుకు చేయడం లేదన్నారు. ఓర్వకల్లు జయరాజ్ స్టీల్ప్లాంట్లో స్థానికేతరులకు ఉద్యోగాలు ఇస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాలు ఉపాధిలేక ఇక్కడి ప్రజలు వలసలు పోతున్నారని తెలిపారు. చంద్రబాబునాయుడు వేలాది ప్రభుత్వ భూములు ఆదాని, అంబానీలకు కట్టపెడుతున్నాడని విమర్శించారు. రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టకుండా రాయలసీమ ప్రజలను సర్వనాశనం చేశాడన్నారు. మోడీ కోసం ఒక్కరోజు రూ. 300 నుండి రూ. 350 కోట్లు ఖర్చుచేస్తున్నాడని, ఈ డబ్బుతో ఒక ప్రాజెక్టు నిర్మాణం చేయవచ్చన్నారు. మోడీ 11 సం కాలంలో చేసింది ఏమిలేదని, ఇచ్చిన వాగ్దానం ఒక్కటి అమలు చేయలేదన్నారు. రాయలసీమకు మోడీ చేసింది ఏమిలేదని ఆయన కర్నూలుకు వచ్చే అర్హత మోడీకి లేదన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పీ రామచంద్రయ్య మాట్లాడుతూ జీఎస్టీ తగ్గించడం వలన పేదవాళ్ళకు వరిగింది ఏమి లేదన్నారు. ఎక్కడా నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదన్నారు. కార్లుపై తగ్గించారు సామాన్య ప్రజలకు ఏమి ఉపయోగమో చెప్పాలని ప్రశ్నించారు. మోడీ 11సం పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు ఏమాత్రం తగ్గలేదన్నారు. సంవత్సరానికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నారు 20 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రైతులకు గిట్టుబాటు ధరల కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. ఎంతో మంది + రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. రైతులు పండించినపంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో మోడీ తీవ్రంగా విఫలం చెందారన్నారు. ఉల్లి, టమోటా రైతులు గిట్టుబాటు ధరలు లేక పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పుల పాలైనారని తెలిపారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా బానకచర్ల నిర్మాణం చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చెప్పడం దుర్మార్గమన్నారు. రాయలసీమ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే గుండ్రేవుల, వేధవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే వలసలు ప్రారంభమైనాయన్నారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని చెప్పడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. మోడీ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హెదా, రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాయలసీమ ద్రోహి అని మోడీ గో బ్యాక్ అని ప్రజలు మోడీకి నిరసన తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, లెనిన్బాబు, నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, సీపీఎం నాయకులు నిర్మలమ్మ, రాముడు, రాధాకృష్ణ, ఎసయ్యూసీఐ నాయకులు నాగన్న, న్యూడెమెక్రసీ నాయకులు భాస్కర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నభిరసూల్, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, మహేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్య దర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి భారతి, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు వెంకటేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాబీర్ బాష, సోమన్న, శరత్ వామపక్షపార్టీలకు చెందిన వివిధ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల కొరకు ఖాళీ స్థలంలో డార్మెంటరీ ప్లే గ్రౌండ్ ఏర్పాటు చేస్తాను



**కర్నూలు అర్బన్ అక్టోబర్ 15 ప్రభాతవార్త** కర్నూలు బి. క్యాంపు లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన గుమ్మడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి, 16102025 వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కర్నూలు పర్యటనలో భాగంగా, గుమ్మడి సంధ్యారాణి, కర్నూలు విచ్చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి, హాస్టల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా లేదా ఆహారం సరిగా అందుతుందా, టైంకు స్నాక్స్ ఇస్తున్నారా లేదా టాయిలెట్స్ బాగున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులు బయటికి వెళ్లకుండా ఏవైనా సమస్యలు వచ్చినా ప్రిన్సిపాలు కు తె లపాలని సూచించారు. అనంతరం పత్రికా విలేకరులతో మాట్లాడుతూకూటమీ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యార్థులకు మెనూ ప్రకారము ప్రతి రోజు మూడు పూటలా నాణ్యమైన భోజనము అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు సరఫరా చేసిన యూనిఫారము మరియు ఇతర వస్తువులు ఇచ్చారా లేదా అని విద్యార్థులను విచారించారు. అయితే విద్యార్థులు డార్మెటరి లేదని మంత్రికి తెలిపారు. పరిస్థితిని గమనించిన మంత్రి సంధ్యారాణి పాఠశాల ప్రక్కన ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలములో కొత్త డార్మెటరి నిర్మాణము కొరకు డివిజినల్ ఇంజినీరు, ,గిదీతి, శ్రీశైలం వారికి అంచనా వ్యయముల కొరకు ప్రతిపాదనలు పంపాలని డి టి డబ్ల్యూ ఓ డి. సురేష్ కు సూచించారు. అంచనా వ్యయం వచ్చిన తర్వాత కచ్చితంగా ఖాళీ స్థలంలో డార్మెటరీ, గ్రౌండ్ ఏర్పాటు చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చినారు. నాణ్యమైన విద్య అందించాలని ప్రిన్సిపాల్ వారికి మరియు ఉపాధ్యాయులకు మంత్రి ఆదేశాలు ఇచ్చారు. ముందుగా వంటగదిని సందర్శించి బాగా నిర్వహిస్తున్నారని వారిని అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి విద్యార్థులను అభినందించారు. మెగా డీఎస్సీ 2025 ద్వారా కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు నాణ్యమైన విద్యనూ అందించాలని తగిన సూచనలు ఇవ్వడము తెలిపారు. ఈ పాఠశాలలో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడు కొనుటకు కొత్తగా టెలిఫోను (ల్యాండ్ ఫోను) సౌకర్యము కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వము వచ్చిన తరువాత గూగుల్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఆంధ్ర ప్రదేశ్ కు వస్తున్నదని మరియు ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలు ఈ ప్రభుత్వము కల్పిస్తున్నదని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి దేవల్ల సురేష్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ఎం. సలోమి, అధికారులు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# బెస్త కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆదోని రామాంజనేయులు



**ఆదోనిలీగల్, అక్టోబర్15, ప్రభాతవార్త;** ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఆదోని పట్టణానికి చెందిన బెస్త రామాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం మంత్రి టీజీ భరత్‌ను పెద్ద ఎత్తున బెస్త కులస్తులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయన బెస్త రామాంజనేయులు మాట్లాడుతూ బెస్తల సంక్షేమం అభివృద్ధి తమ ధ్యేయమన్నారు. నా ప్రాణం ఉన్నంతవరకు బెస్తలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని బెస్త రామాంజనేయులను ఘనంగా సన్మానించారు.

# ఐదేళ్ళ బాలుడిని గుద్దిన ప్రైవేట్ బస్సు

–కాలు నుజ్జు నుజ్జు



**ఆళ్లగడ్డ, అక్టోబర్ 15, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ మండల పరిధిలోని బాచేపల్లె నుంచి ఆళ్లగడ్డకు వెళ్తున్న ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన కొండపల్లె వద్ద అదపు తప్పి పక్కనే ఉన్న చిన్నారిపైకి దూసుకెళ్లడంతో బాలుడి కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు అయింది. ఐదేళ్ళ చిన్నారి దీరజ్ ప్రమాదవశాత్తు బస్సు మార్గంలో ఉండగా వేగంగా వస్తున్న కళాశాల బస్సు అదుపుతప్పి నేరుగా అతని కాలుపైకి ఎక్కింది. భారీ బస్సు చక్రం పడడంతో ధీరజ్ కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయి తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికుల కేకేకలతో హుటాహుటిన అక్కడికి చేరుకున్న వారు బస్సు కింద నుంచి అతికష్టం మీద చిన్నారిని బయటకు తీశారు. కాలు తీవ్రంగా దెబ్బతినడంతో అలస్యం చేయకుండా స్థానికులు, బంధవులు ధీరజ్‌ను ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం జిల్లా కేంద్రం పెద్దాసుపత్రికి తరలించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం ధీరజ్‌పరిస్థితి అందోళనకరంగా ఉంది. ఈఘటనపై స్థానికులు ప్రైవేట్ కళాశాల బస్సు డ్రైవర్‌నిర్లక్ష్యమే ఈప్రమాదానికి కారణమని అరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మోసపోయిన కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తాం

– ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ, అక్టోబర్ 15, ప్రభాతవార్తః** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో దొర్నిపాడులో హెల్త్ అండ్ హెల్త్ కంపెనీలో డబ్బులు కట్టి మోసపోయిన బాధితకుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ తెలిపారు. బుధవారం తన నివాసంలోని కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ దొర్నిపాడుకు చెందిన వీరారెడ్డి, మహేష్‌రెడ్డి, రాజారెడ్డిలు అధిక డబ్బులు వస్తాయని ప్రజలకు మాయమాటలు చెప్పి 2 సంవత్సరాల నుండి 5 వేల మంది దగ్గర ఒక్కొక్కరితో రూ.3.60లక్షలు డబ్బులు కట్టించుకొని నెలకు రూ.40 వేలు వారి అకౌంట్‌లో వేస్తామని చెప్పారు. సుమారు రూ.150 కోట్ల ప్రజల నుండి తీసుకోవడం జరిగిందన్నారు. బాధితకుటుంబాలందరు తమ ఖాతాలో డబ్బులు పడకపోవడంతో బయటకు వచ్చి ధర్నాకు కూర్చోవడం జరిగిందన్నారు. నేడు అక్కడి వెళ్లి చూడగా ముసలివాళ్లు డబ్బులు కట్టారని ఎంతో మంది మహిళలు బంగారు, ఇళ్లలు తాకట్టుపెట్టి డబ్బులు కట్టారని తెలిసిందన్నారు. ఈవిషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు, హోం మంత్రి అనితలతో మాట్లాడడం జరిగిందని పిఎం ప్రొగ్రామ్ అనంతరం ఖచ్చితంగా మోసంచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మూడు టీమ్‌లుగా ఏర్పడి నిందితుల కోసం గాలిస్తున్నారన్నారు. ఖచ్చితంగా నిందితులను పట్టుకొని బాధిత కుటుంబాలకు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజులుగా ఇంత జరుగుతున్నా వైసీపీ నాయకులు బయటకు వచ్చి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. కావాలని వెనక నుండి మహేష్ అనే వ్యక్తి టిడిపి నాయకుడు అంటూ ప్రచారం చేస్తున్నారని ఈకంపెనీ పెట్టి రెండు సంవత్సరాలు అవుతుందని అప్పుడు మహేష్ వైసీపీలో ఉన్నాడన్నారు. గతంలో 40 శాతం మాజీ ఎమ్మెల్యేకు కమిషన్ ఇచ్చారని అరోపణలు వినిపిస్తున్నాయని అరోపించారు. అనవసరంగా ఇలాంటి వాటిని రాజకీయం చేయవద్దని మహేష్ అనే వ్యక్తి తప్పు చేస్తే టిడిపి ప్రభుత్వం సహించేది లేదని తనిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని చెప్పి పార్టీ కార్యాలయానికి లెటర్ కూడ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ పర్యటన అనంతరం ఖచ్చితంగా బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ఎస్పీ, డిఎస్పీలతో మాట్లాడడం జరిగిందని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలాచూస్తానని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు.

